సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం, 24, మే, 2023



44 వేల మందికి పట్టాలు
జిల్లాలో 44,041 వేల మందికి పోడు పట్టాలు అందనున్నాయి. వాటితో పాటు రైతు బంధు సాయం కూడా లభించనుంది. 8లో



మైదానం కళ కళ
సీఎం కప్ జిల్లాస్థాయి పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. క్రీడాకారులతో కొత్తగూడెం ప్రకాశం మైదానం కళకళలాడుతోంది. 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
41° / 27°

జిల్లాలో బుధవారం అధిక ఉష్ణోగ్రత నమోదు వుతుంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గంటగంటకూ ఎండ పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, ఆంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

26న జాబ్‌మేళా

భద్రాచలం: ఐటీడీఏ ఆధ్వర్యంలో భద్రాద్రి, ఖమ్మం జిల్లాల పరిధిలోని గిరిజన నిరుద్యోగ యువతకు ఈనెల 26న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్ఎన్ లేబరేటరీస్ ఫార్మా కంపెనీలో టెక్నికల్ ట్రైనీలు, సన్‌షైన్ హెల్త్ కేర్, ఈక్విటీ గ్రూప్ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ జిరాక్స్ సర్టిఫికెట్లతో 26న ఉదయం 9 గంటలకు ఐటీడీఏలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

'శాట్స్'ను మరింత బలోపేతం చేస్తాం..
- శాట్స్ చైర్మన్ ఈడిగ ఆంజనేయగౌడ్



మాట్లాడుతున్న శాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్

ఖమ్మం స్పోర్ట్స్: తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ(శాట్స్)ను బలోపేతం చేసేందుకు కసరత్తు మొదలుపెట్టినట్లు చైర్మన్ ఈడిగ ఆంజనేయగౌడ్ తెలిపారు. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతున్న జిల్లాస్థాయి సీఎం కప్ పోటీలకు మంగళవారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ శాట్స్‌కు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ సూచనలతో రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా సీఎం కప్ పోటీలు నిర్వహిస్తుండగా అంచనాలకు మించి క్రీడాకారులు పాల్గొంటున్నారని చెప్పారు. రాష్ట్రంలో మండలస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు 4.50లక్షల మంది క్రీడాకారులు హాజరు కావడం రికార్డు అని తెలిపారు. ఇక రాష్ట్రస్థాయిలో ఈనెల 28నుంచి సీఎం కప్ పోటీలను హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియం, గచ్చిబౌలిలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్, షూటింగ్ రేంజ్, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నామని వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులకు ఇప్పటి వరకు ఉన్న నగదు ప్రోత్సాహాన్ని రూ.2.50 కోట్లకు పెంచామని తెలిపారు. కాగా రాష్ట్రంలోని 75 అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్టేడియంలు ఏర్పాటు చేశామని ఆంజనేయ గౌడ్ చెప్పారు. ఇక పాటియాల శిక్షణ కేంద్రానికి దీటుగా హైదరాబాద్‌లో ఎన్ఐఎస్(నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్) శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

మన చరిత్ర చెప్పి..
విజయం సాధించి..

సివిల్స్‌లో మెరిసిన కొత్తగూడెం వాసి సాయికృష్ణ
- జాతీయ స్థాయిలో 293వ ర్యాంకు
- నాలుగో ప్రయత్నంలో సక్సెస్
- ఇంటర్వ్యూలో భద్రాద్రి చరిత్రపై ప్రశ్నలు



సాయికృష్ణను అభినందిస్తున్న తల్లిదండ్రులు శ్రీనివాసరావు, నాగలక్ష్మి తదితరులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఆలిండియా సివిల్స్ పరీక్షలు – 2022లో కొత్తగూడెం పట్టణానికి చెందిన గ్రంథె సాయికృష్ణ జాతీయ స్థాయిలో 293వ ర్యాంకు సాధించారు. సాయికృష్ణ తండ్రి శ్రీనివాసరావు పట్టణంలోని ఓ హోటల్‌లో మేనేజర్‌గా పని చేస్తుండగా తల్లి తల్లి నాగలక్ష్మి గృహిణిగా ఉన్నారు. సివిల్స్‌లో ర్యాంకు సాధించిన విషయం తెలియగానే శ్రీనగర్ కాలనీలోని సాయికృష్ణ నివాసంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా స్కూల్ స్థాయి నుంచి సివిల్స్ వరకు జరిగిన ప్రయాణాన్ని సాయికృష్ణ 'సాక్షి'తో పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ఎస్సెస్సీ వరకు కొత్తగూడెంలోనే..

ఇంటికి దగ్గర్లోనే సూర్యోదయ స్కూల్‌లో మూడు నుంచి పది వరకు చదువుకున్నా. పదో తరగతిలో మంచి మార్కులు రావడంతో విజయవాడకు చెందిన ప్రముఖ కాలేజీలో ఇంటర్‌లో ఫ్రీ సీటు వచ్చింది. ఇంటర్‌లో మార్కులే లక్ష్యంగా కాకుండా సబ్జెక్ట్‌లపై లోతైన అవగాహన పెంచుకునేందుకు ప్రయత్నించాను. దీంతో జేఈఈలో మంచి ర్యాంక్ వచ్చింది. కేరళలోని కాలికట్‌లో బీటెక్ (మెకానికల్) 2017లో పూర్తయింది. ఆ తర్వాత హైదరాబాద్‌లో ఎల్‌అండ్‌టీలో మెకానికల్ ఇంజనీర్‌గా మంచి ప్యాకేజీతో ఉద్యోగం వచ్చింది.

ఇక్కడి సమస్యలే స్ఫూర్తి..

జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత కొత్తగూడెంలో పరిస్థితులు మారాయి. కానీ నా చిన్నతంలో సింగరేణి, కేటీపీఎస్ వంటి ప్రముఖ సంస్థలు ఉన్నా విద్య, వైద్య పరంగా చాలా వెనుకబాటుతనం ఉండేది. కొత్తగూడెంలో ఎంఆర్ఐ స్కాన్ కూడా అందుబాటులో లేదు. ఖమ్మం వెళ్లాల్సి వచ్చేది. అక్కడ కూడా ప్రభుత్వ ఆస్పత్రిలో ఎంఆర్ఐ లేదు. ప్రైవేటు ఆస్పత్రులే దిక్కు. చాలా ఖర్చు పెట్టాల్సి వచ్చేది. ఈ పరిస్థితిలో మార్పు వస్తే బాగుండు అనిపించేది. ఒక్క వైద్య రంగమనే కాదు.. చాలా విషయాల్లో ఇదే పరిస్థితి ఉండేది. పెద్దయ్యాక ఈ పరిస్థితిలో మార్పు తెస్తే బాగుంటుందని అనిపించింది.

మన చరిత్రే మూలం..

సివిల్స్ ఇంటర్వ్యూ సందర్భంగా చరిత్రలో మీ జిల్లా ప్రాధాన్యత ఏంటీ అనే ప్రశ్న ఎదురైంది. శాతవాహనుల కాలం కంటే ముందు కారుకొండ రామారం గుట్టల్లో ఉన్న బుద్ధుడు మొదలు ఒంటి గుట్టలో కేవ్ పెయింటింగ్స్, ఇక్కడ ఇప్పటికీ మిగిలి ఉన్న జైన సంస్కృతి, కంచర్ల గోపన్న కట్టించిన భద్రాచల రామాలయం ఆ తర్వాత పరిస్థితులు పూర్తిగా వివరించాను. అంతేకాకుండా పర్ణశాల విశిష్టతను కూడా చక్కగా వివరించడం ఇంటర్వ్యూ చేసిన వారిని ఆకట్టుకుంది.

ఎప్పటికీ ప్రత్యేక స్థానమే..

ఇక్కడి సమస్యలే నన్ను కదిలించాయి. ఈ సమస్యల పరిష్కారానికి బాధ్యతతో పని చేయాలనే స్ఫూర్తిని రగిలించాయి. ఆ ప్రయాణం చివరి మెట్టులో సివిల్స్ ఇంటర్వ్యూలో నాపై మంచి అభిప్రాయం కలిగించింది కూడా ఈ నేల చరిత్రనే. రేపు ఏ ఉద్యోగం వచ్చినా, ఎక్కడ విధుల్లో ఉన్నా ఈ నేలకు, ఇక్కడి ప్రజలకు ఎప్పటికీ ప్రత్యేక స్థానమే ఉంటుంది.

సివిల్స్ సవాల్

ఎల్ అండ్ టీలో ఉద్యోగం చేస్తున్నా పూర్తి స్థాయిలో సంతృప్తి లేకపోవడంతో సివిల్స్ వైపు వెళ్లాలని నిర్ణయించుకున్నా. 2019లో తొలి ప్రయత్నంలో సక్సెస్ కాలేదు. అప్పటి వరకు చదువులో బ్రేక్ రాని నాకు అదో సవాల్‌లా అనిపించింది. దీంతో 2020, 2021 సంవత్సరాల్లో గట్టిగా ప్రయత్నించినా విజయం సాధించలేకపోయా. దీంతో ప్రిపరేషన్‌లో లోపాలు సవరించుకుంటూ 2022 మే లో రాసిన సివిల్స్‌లో ప్రిలిమ్స్ వచ్చింది. సెప్టెంబర్‌లో మెయిన్స్ క్రాక్ చేశాను. 2023 మేలో ఢిల్లీలో ఇంటర్వ్యూలు జరిగాయి. ఈసారి తప్పకుండా విజయం సాధిస్తాననే నమ్మకం కలిగింది.

అంచనాలకు మించి

చిన్నప్పటి నుంచి చదువులో సాయికృష్ణ ముందుండేవాడు. టెన్త్‌లో మంచి మార్కులు రావడంతో ఇంటర్‌లో ఫ్రీ సీటు వచ్చింది. ఇక వెనక్కి తిరిగి చూడాల్సిన అవసరం రాలేదు. ఇంట్లోనే ఉంటూ సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యాడు. బాబు పట్టుదల తెలిసి కచ్చితంగా ఉన్నత స్థాయికి చేరుకుంటాడని ఆశించాం. మా అంచనాలను మించి సివిల్స్‌లో 293 ర్యాంక్ రావడంతో మేమంతా పట్టరాని సంతోషంలో ఉన్నాం.

– శ్రీనివాసరావు, సాయికృష్ణ తండ్రి

పట్టుదలతో ప్రయత్నించాడు..

సాయికృష్ణకు ముందు నుంచి చదువులో అపజయం అన్నదే తెలియదు. బీటెక్ వరకు అనుకున్నది అనుకున్నట్టుగా సాధించాడు. కానీ సివిల్స్ మొదటి రెండు ప్రయత్నాల్లో విజయం సాధించలేదు. దీంతో చాలా బాధపడ్డాడు. కానీ పట్టుదలతో ప్రయత్నిస్తూ నాలుగోసారి మంచి ర్యాంకు తెచ్చుకున్నాడు. ఇంట్లో పిల్లల చదువుకు ఆటంకం కలగకుండా జాగ్రత్తలు తీసుకునేదాన్ని.

– నాగలక్ష్మి, సాయికృష్ణ తల్లి

జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేశారు..

జగన్నాథపురం సర్పంచ్‌కు కలెక్టర్ అభినందన

సూపర్‌బజార్(కొత్తగూడెం): జలసంరక్షణ చర్యలతో ములకలపల్లి మండలం జగన్నాథపురం గ్రామ పంచాయతీకి జాతీయస్థాయిలో మొదటి స్థానం లభించడం పట్ల కలెక్టర్ అనుదీప్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం తన చాంబర్‌లో సర్పంచ్ గడ్డం భవానీని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జాతీయస్థాయి అవార్డుతో జిల్లా ఖ్యాతిని దేశవ్యాప్తంగా చాటారని అభినందించారు. జిల్లాలో జలసంరక్షణకు చేపడుతున్న చర్యలు ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. ఉపాధిహామీ పథకంలో చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌ల్లో పూడిక తీత పనులు చేపట్టినట్లు తెలిపారు. మిషన్ కాకతీయలో 16 చెరువులను, వాటర్‌షెడ్‌లో 2 ఊట చెరువులను, మిషన్ అమృత్ సరోవర్‌లో ఒక నీటి ఊటకుంటను పునరుద్ధరించామని చెప్పారు. ఇరిగేషన్ శాఖ ద్వారా 31 ఎంఐ ట్యాంకుల కింద 1.98 మిలియన్ క్యూ.మీ. సామర్థ్యంతో 1087 ఎకరాల భూమి సాగులోకి వచ్చిందని వివరించారు. జగన్నాథపురంలో చేపట్టిన వివిధ నీటి సంరక్షణ పనుల ద్వారా 27.63 క్యూ.మీ నీటి సామర్థ్యం కలిగిందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, ఏపీడీ సుబ్రమణ్యం, ఎంపీడీఓలు లక్ష్మయ్య, చిన్న నాగేశ్వరరావు, గ్రామ కార్యదర్శి ఇబ్రహీం పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా బోధన

కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కాలేజీల్లో నాణ్యమైన బోధన అందిస్తున్నారని కలెక్టర్ అనుదీప్ అన్నారు. ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మంగళవారం తన చాంబర్‌లో సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్య మాత్రమే మనిషిని ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని అన్నారు. ఉన్నత చదువులతో తల్లిదండ్రులతో పాటు గ్రామం, జిల్లా, రాష్ట్రం, దేశానికి సేవలందించే స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. విద్యార్థులను ప్రోత్సహించిన తల్లిదండ్రులు, గురువులను అభినందించారు.



సర్పంచ్‌ను అభినందిస్తున్న కలెక్టర్ అనుదీప్

కార్యక్రమంలో డీఐఈఓ సులోచనారాణి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శక ఓటరు జాబితాకు సహకరించాలి

పారదర్శక ఓటరు జాబితా తయారీకి రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ అనుదీప్ కోరారు. ఐడీఓసీలో మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అర్హులకు మాత్రమే ఓటు హక్కు దక్కేలా అధికారులకు సహకరించాలన్నారు. జిల్లాలో 18,438 మంది ఫొటో సిమిలర్ ఎంట్రీలు ఉన్నట్లు గుర్తించామని, వారిలో 38 మంది మరణించారని, 92 మంది ఇతర ప్రాంతాలకు వెళ్లారని తమ విచారణలో తేలిందని చెప్పారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ప్రతి మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. జూన్ 1న కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయంలో ఈవీఎం, వీవీప్యాట్‌ల పనితీరును రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలిస్తామని, ఇద్దరు ఏజెంట్ల జాబితాను ఈనెల 27 వరకు అందజేయాలని కోరారు. ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1 తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు పొందాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కె. వెంకటేశ్వర్లు, ఎన్నికల సెల్ సిబ్బంది నవీన్, బీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఎం, బీజేపీ, బీఎస్పీ ప్రతినిధులు షేక్ అన్వర్, మధు, సత్యనారాయణ, లక్ష్మణ్, ఆనందరావు పాల్గొన్నారు.

భక్తులతో మర్యాదగా మాట్లాడాలి

రామాలయ సిబ్బందికి ఈఓ సూచన

భద్రాచలం: భద్రాచలం రామయ్య దర్శనానికి వచ్చే భక్తులతో సిబ్బంది మర్యాదగా ప్రవర్తించాలని ఆలయ ఈఓ ఎల్.రమాదేవి అన్నారు. మంగళవారం ఆమె ఆలయంలోని లడ్డూ, ఆర్జిత సేవల కౌంటర్లను పరిశీలించారు. అక్కడి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్యూలైన్లలో ఉన్న భక్తులతో మాట్లాడి సౌకర్యాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ.. భద్రాచలం వచ్చే భక్తులు స్వామి వారి దర్శనం అనంతరం మంచి అనుభూతితో తిరిగి ఇంటికి వెళ్లేలా చూడాలన్నారు. భక్తులకు సౌకర్యాల కల్పనలో అలసత్వం తగదని హెచ్చరించారు. ఆర్జిత సేవల్లో భక్తులు భాగస్వాములయ్యేలా చూడాలని సూచించారు.



అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న ఈఓ, సిబ్బంది

అక్రమ నిర్మాణాల తొలగింపు

ఏపీలోని పురుషోత్తపట్నంలోని దేవస్థానం భూముల్లో చేపడుతున్న అక్రమ నిర్మాణాన్ని ఈఓ రమాదేవి ఆధ్వర్యంలో దేవస్థాన సిబ్బంది అడ్డుకున్నారు. అక్రమ నిర్మాణాలు చేపడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

లడ్డూ తయారీ టెండర్ వాయిదా..

దేవస్థానంలో లడ్డూ ప్రసాద తయారీకి నిర్వహించిన మంగళవారం నిర్వహించిన టెండర్‌కు ఒక కాంట్రాక్టర్ మాత్రమే రావడంతో వాయిదా వేస్తున్నట్లు ఈఓ వెల్లడించారు. కాగా గతంలో లడ్డూ తయారీ కాంట్రాక్టర్ గడువు ముగియటంతో దేవస్థానం ఆధ్వర్యంలోనే ప్రస్తుతం లడ్డూలను తయారు చేస్తున్నారు. దేవాదాయ శాఖ కమిషనర్ నియమ నిబంధనల మేరకు అర్హతలు ఉన్న వారికి ఈ టెండర్‌లో పాల్గొనే అవకాశం ఉటుందని ఈఓ తెలిపారు. అయితే టెండర్‌లో ఒక్కరు మాత్రమే పాల్గొనేలా గత కాంట్రాక్టర్ చక్రం తిప్పారని సమాచారం.

ఆదివాసీలను సీఎం మోసం చేశారు..

జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య

చుంచుపల్లి: పోడు భూముల పంపిణీ విషయంలో రెండుసార్లు మాట తప్పి సీఎం కేసీఆర్ ఆదివాసీలను మోసం చేశారని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య ఆరోపించారు. మంగళవారం ఆయన క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పోడు పట్టాలు పంపిణీ విషయంలో ఎప్పటికప్పుడు మాయమాటలతో దాటవేస్తూ గిరిజనులకు ఆశలు కల్పిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో మాత్రమే పోడు పట్టాల పంపిణీ అంశం తెరపైకి తేవడం కేసీఆర్‌కు అలవాటైందని, ఇప్పుడూ అదే చేస్తున్నారని అన్నారు. దివంగత నేత వైఎస్సార్ హయాంలో అర్హులైన ఆదివాసీలకు పోడు పట్టాలు పంపిణీ చేశారని గుర్తు చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో పట్టాలు పంపిణీ చేస్తామని హడావిడి చేసిన ప్రభుత్వం.. మే నెల గడుస్తున్నా ఆ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. ఆదివాసీలకు తక్షణమే పట్టాలు పంపిణీ చేయకుంటే సీఎం వారి ఆగ్రహానికి గురవుతారని అన్నారు. పోడు భూముల సమస్యలపై ఈనెల 27న కొత్తగూడెంలో చేపట్టనున్న పోడు రైతు భరోసా యాత్రలో అధిక సంఖ్యలో ఆదివాసీలు, గిరిజనులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ యాత్ర ఇల్లెందు క్రాస్ రోడ్ నుంచి కొత్తగూడెం కలెక్టరేట్ వరకు కొనసాగుతుందని, అనంతరం జరిగే సభలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతారని తెలిపారు. సమావేశంలో పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఎంపీపీ సుజాత, తెల్లం వెంకట్రావు, తుళ్లూరు బ్రహ్మయ్య, ఊకంటి గోపాలరావు, ఆళ్ల మురళి, తూము చౌదరి, పూణెం శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోరం కనకయ్య

29న ఇంటర్ స్పాట్ కౌన్సెలింగ్

భద్రాచలంటౌన్: వచ్చే విద్యాసంవత్సరం ఇంటర్ ప్రథమ సంవత్సరంలో జిల్లాలోని ఈఎంఆర్ఎస్ కళాశాలల్లో ప్రవేశానికి ఈఎంఆర్ఎస్ చర్ల పాఠశాల (భద్రాచలం)లో ఈనెల 29న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023లో ఎస్సెస్సీ ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. పదో తరగతిలో జీపీఏ ఆధారంగా సీట్లు కేటాయిస్తామని తెలిపారు.

మరో రెండు కావాల్సిందే..

- జిల్లా వైశాల్యం దృష్ట్యా ఫైర్ స్టేషన్ల ఏర్పాటుకు డిమాండ్
- ములకలపల్లి, ఎర్రగుంటల్లో ఏర్పాటుచేస్తే మేలు
- కొత్తగూడెం, భద్రాచలంలో డబుల్ యూనిట్లకు వినతి
- తాజాగా పినపాకకు అగ్నిమాపక కేంద్రం కేటాయింపు



కొత్తగూడెంలోని ఫైర్ స్టేషన్

కొత్తగూడెంటౌన్: వైశాల్యం పరంగా జిల్లా చాలా పెద్దది కావడం, అటు అటవీ ప్రాంతాలు, ఇటు పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ప్రాంతాలు కావడంతో జనావాసాలతో పాటు అటవీప్రాంతాల్లో ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అందులో ఎండాకాలంలో ఈ సమస్య మరింత జఠిలంగా ఉంటుంది. జిల్లాలో భూ విస్తీర్ణం మొత్తం 8,062 చ.కి.మీ. ఉండగా 23 మండలాలు ఉన్నాయి. కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు, పాల్వంచ మున్సిపాలిటీలు, 481 గ్రామపంచాయతీలు, 1351 అవాస గ్రామాలు ఉన్నాయి. 11,02,094 మంది జనాభా ఉన్నారు. జిల్లాలో కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు అశ్వారావుపేట పరిధిలో నాలుగు ఫైర్ స్టేషన్‌లే ఉండటంతో ఎక్కువ సంఖ్యలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఇబ్బందులు తప్పడం లేదు. వాటిలో మణుగూరులో ఔట్ పోస్ట్ ఉంది. ఈ నాలుగు స్టేషన్లకు ఒక్కో ఫైరింజన్ చొప్పున మాత్రమే ఉన్నాయి. దీంతో ఒకేసారి వేర్వేరు చోట్ల అగ్నిప్రమాదాలు జరిగితే తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఇక పినకపాకలో మరో ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకోసం స్థల కేటాయింపు పూర్తయింది. వీటికి తోడు ఎర్రగుంట, ములకలపల్లిలో కూడా ఫైర్ స్టేషన్లు ఏర్పాటు చేస్తే అగ్ని ప్రమాదాలు జరిగినా తక్కువ నష్టంతో బయటపడే అవకాశం ఉంటుందని ఆయా ప్రాంతాల్లో ప్రజలు అంటున్నారు.

ఖాళీల భర్తీ ఎప్పుడో..

కొత్తగూడెం ఫైర్ స్టేషన్‌కు ఇన్‌చార్జ్‌గా భద్రాచలం ఫైర్ స్టేషన్ అధికారి శ్రీనివాసరావు వ్యవహరిస్తుండగా, అశ్వారావుపేట ఫైర్ స్టేషన్‌కు సత్తుపల్లి అధికారి చంద్రశేఖర్ ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. ఇల్లెందు ఫైర్ స్టేషన్ ఆఫీసర్‌గా రామారావు ఉన్నారు. కొత్తగూడెం, అశ్వారావుపేటల్లో ఫైర్ ఆఫీసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక కొత్తగూడెంలో మొత్తం సిబ్బంది 15 మందికి గాను 11 మంది, భద్రాచలంలో 11కు ఐదుగురు, ఇల్లెందులో 16కు 10 మంది, అశ్వారావుపేటలో 16 మందికి ఆరుగురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. మణుగూరు ఔట్ పోస్టులో 11 మంది పని చేస్తున్నారు. జిలాలోని నాలుగు స్టేషన్లలో కలిపి 58 మందికి గాను 32 మంది విధుల్లో ఉండగా మరో 26 పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. దీంతో పాటు కొత్తగూడెం, భద్రాచలంలో డబుల్ యూనిట్లను కేటాయించాలని అటు ప్రజలు, ఇటు అధికారులు కూడా కోరుతున్నారు. అలా చేస్తే ఫైర్ స్టేషన్లలో వాహనాలు, అధికారులు, సిబ్బందిని కూడా రెట్టింపుగా కేటాయించే అవకాశం ఉంటుంది. దీంతో ఎండాకాలమే కాకుండా మిగతా సమయాల్లో అగ్నిప్రమాదాలు జరిగితే ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా కాపాడవచ్చని చెబుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం..



జిల్లాలో నాలుగు ఫైరింజన్‌లు పని చేస్తున్నాయి. జిల్లా పెద్దది కావడంతోపాటు ఒకచోట ప్రమాదం సంభవించిన సమయానే మరో చోట ఏదైనా జరిగితే వెళ్లాలంటే ప్రస్తుత పరిస్థితుల్లో ఇబ్బందికరంగా ఉంది. కొత్తగూడెం, భద్రాచలం ఫైర్ స్టేషన్లకు డబుల్ యూనిట్లు కేటాయించడమే కాక ఇతర సమస్యలపై ఉన్నతాధికారులకు నివేదించాం. రానున్న కాలంలో సిబ్బంది కొరతతోపాటు ఫైర్ స్టేషన్‌లోని సమస్యలు పరిష్కారం కానున్నాయి.

– శ్రీనివాస్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి

గోడు చెప్పుకునేందుకే పాదయాత్ర

తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ రషీద్

టేకులపల్లి: తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ సయ్యద్ రషీద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆ సంఘంతో పాటు టీయూఎఫ్, తెలంగాణ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ప్రగతిభవన్ వరకు చేపట్టిన పాదయాత్ర మంగళవారం టేకులపల్లికి చేరింది. ఈ సందర్భంగా రషీద్‌తో పాటు పలువురు మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ సాధన కోసం ఏర్పడిన టీఆర్ఎస్ జెండా మోస్తూ పోరాడి, ఎన్నో కష్టాలు, పోలీసు నిర్బంధాలు, లాఠీచార్జీలతో పాటు జైలుకు కూడా వెళ్లిన ఉద్యమకారులంతా నేడు ఆర్థికంగా, సామాజికంగా చితికిపోయారని, తమకు సాయం చేయాలని కేసీఆర్‌ను కోరేందుకే పాదయాత్ర చేపట్టామని వెల్లడించారు. పాదయాత్రకు టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఇస్లావత్ లక్ష్మణ్‌నాయక్, వైఎస్సార్‌టీపీ మండల అధ్యక్షుడు భూక్య బాలాజీ, సీపీఎం నేత కడుదుల వీరన్న, తేజావత్ రవి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో కలకోటి ఐలయ్య, ఎండీ మంజూర్, యాకన్న, హుస్సేన్, గూడెల్లి యాకయ్య, యూసుఫ్, ఉబ్బన రవికుమార్, మాతంగి హరికృష్ణ, మోటపోతుల జయరాజు, బిల్లా ముత్యం, షేక్ గౌస్ పాషా, ఎండీ సద్దాం, చికాకుల భాస్కర్, పఠాన్ సత్తార్, గుర్రం సుధాకర్ పాల్గొన్నారు.



పాదయాత్ర చేస్తున్న ఉద్యమకారులు



రోళ్లపాడు వద్ద అడ్డుకుంటున్న పోలీసులు

అనుమతి లేదంటూ అరెస్ట్

పాదయాత్రకు అనుమతి లేదంటూ ఉద్యమకారులను పోలీసులు అరెస్ట్ చేశారు. టేకులపల్లిలో పాదయాత్ర ముగించుకుని ఇల్లెందు వైపు వెళ్తుండగా రోళ్లపాడు క్రాస్‌రోడ్ వద్ద టేకులపల్లి, ఇల్లెందు సీఐలు, ఇద్దరు ఎస్ఐలు, సిబ్బంది అడ్డుకున్నారు. శాంతియుతంగా పాదయాత్ర చేస్తున్న తమను ఎందుకు అడ్డుకుంటున్నారని ఉద్యమకారులు అంటున్నా వినకుండా అందరినీ ట్రాలీలో ఎక్కించుకుని గుండాల పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై టేకులపల్లి ఎస్ఐ రమణారెడ్డిని వివరణ కోరగా ఎలాంటి అనుమతి లేకుండా పాదయాత్ర చేస్తున్నారని, శాంతిభద్రతల సమస్య సృష్టించవచ్చనే కారణంతో వారిని అడ్డుకున్నామని తెలిపారు.

క్లుప్తంగా

ఆలయ భూముల సర్వే


సర్వే నిర్వహిస్తున్న అధికారులు

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని అన్నదైవం రెవెన్యూ గ్రామంలోని శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి చెందిన భూముల్లో అధికారులు సర్వే చేపట్టారు. సర్వే నంబర్లు 39, 40లోని ఆలయ భూముల్లో రెవెన్యూ, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జాయింట్ సర్వే నిర్వహించారు. సర్వే నంబర్ 40లోని ఆలయ భూమికి సంబంధించిన హద్దులను పరిశీలించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ సహాయ కమిషనర్ సులోచన, ఏసీ ఆఫీస్ సూపరింటెండెంట్ గౌరీశంకర్, జోనల్ సర్వేయర్ అనిల్, తహసీల్దార్ భద్రకాళి, రెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్లీనరీని జయప్రదం చేయండి..


మాట్లాడుతున్న ధర్మార్జున్

ములకలపల్లి: జూన్ 4వ తేదీన సూర్యాపేటలో నిర్వహించనున్న తెలంగాణ జన సమితి (టీజేఎస్) రాష్ట్ర ప్లీనరీని విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మార్జున్ పిలుపునిచ్చారు. మండలంలోని సుబ్బనపల్లి గ్రామంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ నబీసాహెబ్ స్వగృహంలో మంగళవారం జరిగిన జిల్లా ప్లీనరీలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. కోటి ఆశలతో పోరాడి సాధించుకున్న తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమ ఆకాంక్షలను నీరుగారుస్తోందని, అమరవీరుల ఆశయాలను తుంగలో తొక్కుతోందని ఆరోపించారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు మల్లెల రామనాథం, జిల్లా ప్రధాన కార్యదర్శి కరుణాకర్‌రెడ్డి, జిల్లా నాయకులు బరగడ దేవదానం, రవీందర్ నాయక్, శివ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధురాలు మృతి


టేకులపల్లి: మద్యం మత్తులో పురుగులమందు తాగిన వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. బోడు ఎస్‌ఐ రంజిత్ కథనం ప్రకారం.. మండలంలోని రామచంద్రునిపేట పంచాయతీ పాతర్లగడ్డకు చెందిన ఈసం లక్ష్మి (60) సోమవారం సాయంత్రం మద్యం సేవించి చేనుకు వెళ్లి వస్తానని కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లింది. రాత్రి 8 గంటలైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చేనుకు వెళ్లి చూసేసరికి లక్ష్మి కింద పడి ఉంది. ఏం జరిగిందని అడగగా ఏదో పురుగులమందు తాగానని చెప్పడంతో వెంటనే సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఆటోలో తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలికి భర్త రామయ్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు ఈసం కృష్ణ ఫిర్యాదు మేరకు బోడు పోలీసులు కేసు నమోదు చేశారు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న కస్నా

సుజాతనగర్: పురుగులమందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని స్టేషన్ బేతంపూడి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బానోత్ కస్నా కిరాణా దుకాణం పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. కాగా, అదే గ్రామానికి చెందిన ఓ ముగ్గురు వ్యక్తులు కర్రలు, రాళ్లు, మారణా యుధాలతో కస్నాపై దాడికి పాల్పడ్డారు. దీంతో మనోవేదనకు గురైన కస్నా పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు అతడిని ఆస్పత్రికి తరలించారు. దాడికి పాల్పడిన సదరు వ్యక్తులు కస్నాకు దగ్గరి బంధువులేనని తెలిసింది. ఘటనపై కస్నా భార్య నాగమణి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

డెంగీతో వివాహిత మృతి


సంధ్య (ఫైల్)

కరకగూడెం: డెంగీతో ఓ వివాహిత మృతిచెందిన ఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన మలిపెద్ది సంధ్య (22)కు ఇటీవల తీవ్ర జ్వరం రావడంతో భర్త రామకృష్ణ ఆమెను భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పాడు. అనంతరం పరీక్షించిన వైద్యులు ఆమెకు డెంగీ లక్షణాలున్నాయని నిర్ధారించి చికిత్స అందిస్తూ వచ్చారు. ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించి మంగళవారం సాయంత్రం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలికి 18 నెలల కుమారుడు ఉన్నాడు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,205

మైదానం కళ కళ

సీఎం కప్ పోటీలతో సందడి
- ఉత్సాహంగా పాల్గొంటున్న క్రీడాకారులు
- భారీగా హాజరవుతున్న వీక్షకులు


ఖో-ఖో ఆడుతున్న క్రీడాకారులు


బాస్కెట్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు

కొత్తగూడెంటౌన్: సీఎం కప్ జిల్లాస్థాయి పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులతో కొత్తగూడెంలోని ప్రకాశం మైదానం కళకళలాడుతోంది. కబడ్డీ, ఖో-ఖో, ఫుట్‌బాల్ తదితర ఆటలకు వీక్షకుల నుంచి ఆదరణ లభిస్తుండటంతో సందడిగా మారింది. జిల్లాస్థాయి సీఎం కప్ పోటీలు సోమవారం ప్రారంభం కాగా, మంళవారం రెండో రోజుకు చేరుకున్నాయి. జిల్లాలోని అన్ని మండలాల నుంచి క్రీడాకారులు రావడంతో కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియం కోలాహలంగా మారింది. రామవరంలోని సాధన మైదానంలోనూ క్రీడాకారులకు ఏర్పాటు చేశారు. వాలీబాల్ పురుషుల విభాగంలో జిల్లాస్థాయికి 23 జట్లు వచ్చాయి. 230 మంది క్రీడాకారులు తలపడుతున్నారు. కబడ్డీ మహిళల జట్లు 4 రాగా.. 40 మంది క్రీడాకారులు, పురుషుల కబడ్డీ 23 జట్లకు గాను 230 మంది, ఫుట్‌బాల్ 8 జట్లకు గాను 88 మంది, బ్యాడ్మింటన్‌లో 50 మంది, స్విమ్మింగ్‌లో 10 మంది క్రీడాకారులు క్రీడాప్రాంగణాలకు చేరుకున్నారు. కాగా, క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. వైద్య శిబిరాన్ని కూడా ఏర్పాటు చేశారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి టి.సీతారాం, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పోటీలు ఎంతో ఉపయోగకరం..



సీఎం కప్ పోటీలు గ్రామీణ క్రీడాకారులకు మంచి వేదిక. వారు తమ నైపుణ్యాన్ని పెంచుకునేందుకు ఎంతో ఉపయోగపడతాయి. ఇల్లెందు నుంచి పురుషులు, మహిళల జట్లు 5 ఈవెంట్లలో పాల్గొంటున్నాయి. 80 మంది క్రీడాకారులతో వచ్చాం. ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ పోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది.
– స్టెల్లా, పీడీ, సీహెచ్ఎస్, ఇల్లెందు

మంచి ఆదరణ లభిస్తోంది..



కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో నిర్వహిస్తున్న క్రీడాపోటీలకు మంచి ఆదరణ లభిస్తోంది. జిల్లా నలుమూలల నుంచి సుమారు 608 మంది క్రీడాకారులు తరలివచ్చారు. పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తాగునీటి సదుపాయం, మెడికల్ క్యాంప్‌లను ఏర్పాటు చేశాం. బుధవారంతో సీఎం కప్ పోటీలు ముగియనున్నాయి.
– టి.సీతారాం, డీవైఎస్ఓ

సత్తా చాటేందుకు వేదిక



జిల్లాస్థాయిలో నిర్వహిస్తున్న సీఎం కప్ పోటీల్లో క్రీడాకారులు మరింతగా రాణించి రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపాలి. క్రీడాకారులు సత్తా చాటేందుకు ఇలాంటి క్రీడా వేదికలు మరింతగా ఉపయోగపడతాయి. ప్రధానంగా గ్రామీణ క్రీడాకారులు ఈ పోటీల ద్వారా వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.
– దుంపల మల్లికార్జున్‌రావు, అథ్లెటిక్స్ కోచ్, కొత్తగూడెం

ఖో-ఖోలో సత్తా చాటుతాం..



కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో జరుగుతున్న జిల్లాస్థాయి క్రీడాపోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది. ఖో-ఖో జట్టుతో మేము వచ్చాం. తప్పకుండా ఖో-ఖోలో మా జట్టు విజయం సాధిస్తుందని అనుకుంటున్నా. మా సత్తా చాటి గెలుస్తాం. ఇక్కడ పోటీలకు వచ్చే క్రీడాకారుల కోసం ఏర్పాట్లు బాగున్నాయి.
– కుమారి, ఖో-ఖో క్రీడాకారిణి, ఆళ్లపల్లి

పోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది..



జిల్లాస్థాయిలో సీఎం కప్ పోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది. తోటి క్రీడాకారులతో ఉత్సాహంగా ఆడాం. తప్పక మా జట్టు ఖో-ఖోలో విజయం సాధిస్తుందని భావిస్తున్నా. క్రీడాకారుల కోసం స్టేడియంలో ఏర్పాట్లు బాగున్నాయి. ఉదయం, సాయంత్రం పోటీలను నిర్వహిస్తున్నారు.
– డి.రవి, ఖో-ఖో క్రీడాకారుడు, ఆళ్లపల్లి


రేకులు ఎగిరిపోయిన పెద్దిరాజు ఇల్లు

చంద్రుగొండలో భారీ వర్షం

చంద్రుగొండ: మండలంలో సోమవారం అర్ధరాత్రి గాలిదుమారంతోపాటు భారీవర్షం కురిసింది. గాలి దుమారానికి చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. రేకులు, పెంకుల ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. అనేక గ్రామాల్లో స్తంభాలు కిందపడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. బెండాలపాడులో తాటి పెద్దిరాజు ఇంటి రేకులు ఎగిరిపోయాయి. అకాలవర్షానికి రాశులుగా పోసిన ధాన్యం తడిసింది.

ధాన్యం అమ్ముకునేందుకు రైతుల అవస్థలు

కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం


మొండికుంట కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం

అశ్వాపురం: మండలంలోని ప్రధాన సాగునీటి వనరైన తుమ్మలచెరువు ఆయకట్టు రైతులు యాసంగి ధాన్యం అమ్ముకోవడానికి నానా అవస్థలు పడుతున్నారు. మండలంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మొండికుంట ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసి ముద్దయింది. వరదకు కింది ప్రాంతంలో ఆరబోసిన ముగ్గురు రైతులకు చెందిన ధాన్యం కొట్టుకుపోయింది. ఈదురుగాలులకు ధాన్యంపై కప్పిన పరదాలు, టార్పాలిన్లు కొట్టుకుపోయి ధాన్యం తడిసింది. మంగళవారం తడిసిన బస్తాల్లోని ధాన్యాన్ని వేరే బస్తాల్లో పోయడం, ఆరబెట్టే పనుల్లో నిమగ్నమయ్యారు. అయితే, మిల్లర్లు ఎన్ని కొర్రీలు పెడతారో, ఎంత కోత విధిస్తారో అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి డయాలసిస్ సేవలు షురూ


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న డయాలసిస్ కేంద్రం

మణుగూరురూరల్: మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో బుధవారం నుంచి డయాలసిస్ సేవలు ప్రారంభం కానున్నాయి. కిడ్నీ బాధితులు డయాలసిస్ చేయించుకోవాలంటే ఎన్నో వ్యయప్రయాసాల కోర్చాల్సి వచ్చేది. మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రిలో రూ.50 లక్షల అంచనా వ్యయంతో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీంతో పినపాక నియోజకవర్గ కిడ్నీ బాధితులు డయాలసిస్ చేయించుకునే తిప్పలు తప్పనున్నాయి. గతంలో బాధితులు డయాలసిస్ చేయించుకోవాలంటే భద్రాచలం, కొత్తగూడెం, ఖమ్మం వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లేవారు. ప్రయాణంలో వారు పడే అవస్థలు వర్ణణాతీతమనే చెప్పవచ్చు. మణుగూరు కేంద్రంగా డయాలసిస్ ఏర్పాటు కావడంతో కరకగూడెం, పినపాక, మణుగూరు, అశ్వాపురం మండలాల బాధితుల ఇబ్బందులు తొలగిపోనున్నాయి. ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు చొరవ, ఎమ్మెల్యే రేగా కాంతారావు కృషితో ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రం అన్ని హంగులతో ప్రారంభానికి సిద్ధంగా ఉంది. బుధవారం ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించనున్నారు.

'ముంపు'పై ముందస్తు చర్యలు చేపట్టాలి

ఎమ్మెల్యే పొదెం వీరయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొదెం వీరయ్య

భద్రాచలం: గోదావరి వరద ముంపు ప్రాంతాల్లో ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం తన క్యాంప్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతేడాది వరదలు ముంచెత్తి ఏజెన్సీ ప్రాంత ప్రజలను తీవ్రంగా నష్టపరిచినా ఇప్పటివరకూ ముంపు నివారణ చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. కమిటీ సిఫార్సుల అమలును ప్రభుత్వం విస్మరిస్తోందని విమర్శించారు. రూ.10 వేల వరద సాయం అందరికీ అందలేదన్నారు. స్లూయిజ్‌ల లీకేజీ పనులను వెంటనే చేపట్టాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నిధులు విడుదల చేసి కరకట్టను పటిష్టం చేయాలని కోరారు. సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సరెళ్ల నరేష్, టీపీసీసీ సభ్యులు బుడగం శ్రీనివాస్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతరేల రవికుమార్, నాయకులు భోగాల శ్రీనివాస్ రెడ్డి, బలుసు నాగ సతీష్, బంధం శ్రీనివాస్ గౌడ్, గండేపల్లి హనుమంతరావు, సరెళ్ల వెంకటేష్, రాగం సుధాకర్, చింతరేల సుధీర్, ఎడారి ప్రదీప్, రాసమల రాము, సతీష్, వసంతాల రాజేశ్వరి, పందాల సరిత, తుమల రాణి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం


అమీర్ (ఫైల్)


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్‌ఐ

అశ్వారావుపేటరూరల్: ఓ చెరువులో యువకుడు శవమై కనిపించిన ఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. అశ్వారావుపేటలోని నందమూరినగర్‌కు చెందిన ఎస్కే అమీర్ (21) కొద్ది నెలలుగా మానసిక సమస్యలతో సతమతమవుతున్నాడు. గుర్తించిన కుటుంబీకులు విజయవాడ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం భోజనం చేసి టైర్ల దుకాణానికి వెళ్లి వస్తానని చెప్పి రాత్రి అయినా తిరిగి రాలేదు. ఆలస్యంగా గుర్తించి ఆచూకీ కోసం కుటుంబీకులు గాలిస్తున్న క్రమంలోనే స్థానిక దొంతికుంట చెరువులో మంగళవారం ఉదయం విగతజీవిగా తేలాడు. సమాచారం అందుకున్న స్థానిక సీఐ బొమ్మెర బాలకృష్ణ, ఎస్‌ఐ రాజేశ్‌కుమార్ మృతదేహాన్ని బయటకు తీయించారు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబీకులు మృతదేహాన్ని పరిశీలించి అమీర్‌గా గుర్తించారు. మృతుని తండ్రి ఇబ్రహీం ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సర్పంచ్‌పై కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: అధికార పార్టీకి చెందిన ఓ సర్పంచ్‌పై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక ఎస్‌ఐ రాజేశ్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని నారంవారిగూడెంకాలనీకి చెందిన నిమ్మల సత్యనారాయణ మూడు రోజుల కిందట జాతీయ రహదారిపై ఉన్న బారికేడ్లను సరిచేశాడు. దీంతో అక్కడే ఉన్న నారంవారిగూడెం గ్రామ సర్పంచ్ ఎం.వెంకటనాగముత్యం బారికేడ్లను ఎందుకు సరి చేస్తున్నావని వాగ్వాదానికి దిగాడు. కాగా, తనపై సర్పంచ్ దాడికి పాల్పడ్డాడని సత్యనారాయణ ఫిర్యాదు చేయగా సర్పంచ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పది మందిపై కేసు


ఆస్పత్రిలో బానోతు స్రవంతి

పాల్వంచ: యువతిని కిడ్నాప్ చేసి తీవ్రంగా గాయపరిచిన వ్యక్తులపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ నరేశ్ కథనం ప్రకారం.. గట్టాయిగూడేనికి చెందిన బానోతు స్రవంతి నటరాజ్ సెంటర్‌లోని సత్య ఫార్మసీలో పనిచేస్తోంది. సోమవారం విధుల్లో ఉండగా కారులో వచ్చిన, స్రవంతికి పరిచయం ఉన్న రామకృష్ణ భార్య శైలజ కుటుంబ సభ్యులు భద్రు, రవి, శాంత, అనిల్.. వచ్చి బలవంతంగా కారులో ఎక్కించుకుని మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లా వద్ద గల మామిడితోటలోకి తీసుకెళ్లి కర్రలతో తీవ్రంగా కొట్టారు. కాగా, అక్కడి నుంచి తప్పించుకుని వచ్చిన స్రవంతి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా పదిమందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

44 వేల మందికి పోడు పట్టాలు

- జూన్ 24 నుంచి పంపిణీకి రంగం సిద్ధం
- స్వయంగా అందజేస్తానన్న సీఎం కేసీఆర్


పోడు భూములను సర్వే చేస్తున్న అధికారులు (ఫైల్)

చుంచుపల్లి: పోడు పట్టాల పంపిణీకి సీఎం కేసీఆర్ ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. జూన్ 24 నుంచి 30వ తేదీ వరకు పోడు పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించారు. పోడుపట్టాలు పొందేందుకు అర్హులైన గిరిజనుల బ్యాంకు ఖాతా లను సేకరించాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఎన్నో ఏళ్లుగా పోడు పట్టాల కోసం నిరీక్షిస్తున్న ఆదివాసీ గిరిజనుల కళ త్వరలోనే నెరవేరనుంది. ప్రభుత్వం ఫిబ్రవరిలోనే పోడు పట్టాలను పంపిణీ చేయాలని కొంత కసరత్తు చేసినా అది సాధ్యం కాలేదు. ఇటీవల ముఖ్యమంత్రి మరి కొద్ది రోజుల్లో పోడుపట్టాలు పంపిణీ చేస్తామని ప్రకటించారు. అయితే జూన్ 2న రాష్ట్ర అవతరణ సందర్భంగా చేపట్టబోయే కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం పోడు పట్టాలు పంపిణీ చేసే తేదీలను ఆయన ప్రకటించారు. స్వయంగా ముఖ్యమంత్రి జిల్లాల్లో పర్యటించి పోడు పట్టాలు పంపిణీ చేయనున్నట్లు ప్రకటించడంతో పలువురు వర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, జిల్లాలో వచ్చిన పోడు దరఖాస్తులపై రెండుసార్లు తీవ్ర స్థాయిలో అధికారులు కసరత్తు చేశారు. చివరకు 44,041 దరఖాస్తులను జిల్లాస్థాయి కమిటీ ఆమోదానికి సబ్‌డివిజనల్ స్థాయి కమిటీ సిఫారసు చేసింది. జిల్లాలో 313 గ్రామపంచాయతీల పరిధిలో 717 ఆవాస గ్రామాల్లో గిరిజనులు పోడుసాగు చేస్తున్నారని అధికారులు గుర్తించారు. జిల్లాలో పోడు హక్కు పట్టాల కోసం 83,341 మంది దరఖాస్తు చేసుకున్నారు. వాటి పరిధిలో 2.98 లక్షల ఎకారాల భూములు సాగులో ఉన్నట్లు తేలింది. వాటిలో 65,616 మంది గిరిజనులు 2,41,102 ఎకరాల పరిధిలో పోడు హక్కుపత్రాల కోసం దరఖాస్తులను సమర్పించారు. అయితే, ప్రస్తుతం ప్రభుత్వం గిరిజనులకు మాత్రమే పట్టాలు ఇవ్వాలని నిర్ణయించింది. జిల్లాలో వచ్చిన గిరిజనుల దరఖాస్తుల పరిశీలించిన అనంతరం 21,603 ఎస్‌డీఎల్సీలో తిరస్కరణకు గురికాగా, మిగిలిన 44,041 దరఖాస్తులను డీఎల్సీ ఆమోదానికి పంపారు. ప్రస్తుతం డీఎల్సీ పరిధిలో ఉన్న దరఖాస్తులకు 1,33,141 ఎకరాల భూమిని పంపిణీ చేయాల్సి ఉంటుంది. పోడు భూములపై ఆధార పడిన గిరిజనేతరులు, ఇతర వర్గాలున్నాయి. వీరంతా దరఖాస్తుతో పాటు అందజేసిన పత్రాలను అటవీ హక్కుల కమిటీలు, రెవెన్యూ, అటవీ అధికారులు పరిశీలించారు. అటవీ హక్కుల చట్టం-2005 ప్రకారం గిరిజనేతరులకు పోడు భూములపై హక్కు పొందేందుకు మూడు తరాలుగా అటవీ ప్రాంతంలో నివాసితులై ఉండాలి. ఆ మేరకు ఒక తరాన్ని 25 ఏళ్లుగా పరిగణనలోకి తీసుకుంటే 2005 నాటికి 75 ఏళ్లుగా అక్కడే ఉన్నట్లు ఆధారాలు చూపాలి. అవి వచ్చే వరకు జిల్లాలో వచ్చిన 17,725 దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టాలని జిల్లా కమిటీ నిర్ణయించింది.

కార్పొరేట్ల కోసం పనిచేస్తున్న మోదీ


మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

పాల్వంచరూరల్: ప్రజల కోసం కాకుండా కార్పొరేట్ శక్తుల కోసం ప్రధాని మోదీ పనిచేస్తున్నారని, కేంద్రంలోని బీజేపీని గద్దె దించి దేశాన్ని కాపాడుకోవాల్సిన అవసరముందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని చంద్రాలగూడెం, ఉల్వనూరు, లక్ష్మీదేవిపల్లి, ప్రభాత్‌నగర్, పాండురంగాపురం, సూరారం, కోడిపుంజులవాగు గ్రామాల్లో మంగళవారం కూనంనేని పర్యటించి ప్రసంగించారు. ప్రజలను మభ్యపెట్టేందుకు పెద్ద నోటును రద్దుచేశారని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవినీతిపరులు, ఆక్రమార్కులకు అండగా నిలుస్తోందని, ప్రజలకు చెందాల్సిన సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడమే పనిగా పెట్టుకుందని ఆరోపించారు. రాష్ట్రంలో 2.99 లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలిస్తామని ప్రకటించిన కేసీఆర్ సర్వేతోనే కాలం వెళ్లదీస్తున్నారన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ఎజెండాగా చేసుకుని జూన్ 4వ తేదీన కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ప్రకాశ్ స్టేడియంలో లక్ష మందితో ప్రజాగర్జన బహిరంగ సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషాతోపాటు ముత్యాల విశ్వనాథం, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, గుండాల నాగరాజు, అన్నారపు వెంకటేశ్వర్లు, శనగరపు శ్రీను, గుండెపూరి రాజు, వేములపల్లి శ్రీను, ఎండీ పాషా, రాందాస్, సమ్మయ్య, వజ్జ నారాయణ, సారయ్య, అవుల సతీశ్, రామచందర్, వేరమ్మ, సుధాకర్, కోటి నాగేశ్వరరావు, జక్కుల సత్యనారాయణ పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్


విద్యార్థినులతో మాట్లాడుతున్న డేవిడ్‌రాజ్

భద్రాచలం: పదో తరతగతి, ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులు కాని గిరిజన గురుకుల విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ, ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్ కోరారు. మంగళవారం ఆయన భద్రాచలం గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలలో నిర్వహిస్తున్న అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ కోచింగ్ క్యాంప్ తరగతులను పరిశీలించి మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని గిరిజన గురుకులాల్లో చదివి పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ఉత్తీర్ణులు కాని బాలికలకు భద్రాచలంలో, బాలురకు కిన్నెరసానిలో శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. భద్రాచలం, వైరా, మణుగూరు, అన్నపురెడ్డిపల్లి, కొత్తగూడెం, సుదిమళ్ల, అంకంపాలెం తదితర గురుకులాల నుంచి 255 మంది ఇంటర్మీడియట్ బాలికలు భద్రాచలం గిరిజన గురుకుల కోచింగ్ క్యాంప్‌లో తర్ఫీదు పొందుతున్నట్లు తెలిపారు. దమ్మపేట, కిన్నెరసాని, గుండాల, ఖమ్మం, సింగరేణి, తిరుమలాయపాలెం తదితర గిరిజన గురుకులాల నుంచి 200 మంది ఇంటర్మీడియట్ బాలురు కిన్నెరసానిలో నిర్వహిస్తున్న కోచింగ్ క్యాంపునకు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. భద్రాచలం గిరిజన గురుకుల పాఠశాలలో 79 మంది బాలికలు, కిన్నెరసానిలో 30 మంది బాలురు 10వ తరగతి సప్లిమెంటరీ కోచింగ్ క్యాంపునకు హాజరవుతున్నారని వివరించారు. అనంతరం బాలికలకు అందుతున్న శిక్షణను అడిగి తెలుసుకున్నారు. అధ్యాపకులు, ఉపాధ్యాయులతో సమావేశమై వారికి సలహాలు, సూచనలిచ్చారు. కార్యక్రమంలో భద్రాచలం గిరిజన గురుకుల కళాశాల, పాఠశాల ప్రిన్సిపాల్ దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనకరంగానే!

ఎంపీ అవినాశ్ మాతృమూర్తికి ఆస్పత్రిలో కొనసాగుతున్న చికిత్స

- క్రిటికల్ కేర్ యూనిట్‌లో వైద్యం అందిస్తున్న విశ్వభారతి వైద్య బృందం
- తల్లి వద్దే ఉంటూ బాగోగులు చూసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాశ్
- సీబీఐ అధికారులు ఆస్పత్రిలోకి వచ్చారంటూ ఎల్లో మీడియా తప్పుడు వార్తలు
- దుష్ప్రచారాలను ఖండిస్తూ శాంతియుతంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తల నిరసన



కర్నూలులోని విశ్వభారతి హాస్పిటల్ వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న పార్టీ శ్రేణులు

సాక్షి ప్రతినిధి కర్నూలు: ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి మాతృమూర్తి శ్రీలక్ష్మి ఆరోగ్యం విషమంగానే ఉంది. కర్నూలులోని విశ్వభారతి ఆస్పత్రి వైద్యుల బృందం క్రిటికల్ కేర్ యూనిట్(సీసీయూ)లో ఆమె ఆరోగ్యాన్ని ప్రత్యేకంగా పర్యవేక్షిస్తోంది. ఎంపీ అవినాశ్ నిరంతరం అక్కడే ఉంటూ తల్లి బాగోగులు ఎప్పటికప్పుడు స్వయంగా చూసుకుంటున్నారు. వారిని పరామర్శించేందుకు రాయలసీమ జిల్లాల నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు ఆస్పత్రికి పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఎంపీ అవినాశ్‌ను సీబీఐ అరెస్టు చేస్తోందంటూ తప్పుడు వార్తలకు తెర తీసిన ఎల్లో మీడియా తన విష ప్రచారాన్ని కొనసాగిస్తోంది. శ్రీలక్ష్మి ఆరోగ్యం ఆందోళనకరంగా ఉందని వైద్యులు బులిటెన్ విడుదల చేయడం, ఓ వర్గం మీడియా తప్పుడు వార్తల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు ఆస్పత్రి ఎదుట రోడ్డుపైనే సోమవారం రాత్రంతా గడిపారు. ముందు జాగ్రత్త చర్యగా పోలీసులు భారీగా బలగాలను తరలించారు.

సీబీఐ అధికారులు ఆస్పత్రిలోకి వెళ్లారంటూ..

పోలీస్ గెస్టుహౌస్‌లో ఉంటున్న సీబీఐ అధికారులు అక్కడి నుంచి ఎస్పీ కార్యాలయానికి మాత్రమే వెళ్లారు. అయితే ఎల్లో మీడియా మాత్రం సీబీఐ అధికారులు విశ్వభారతి ఆస్పత్రిలోకి వెళ్లారని, అక్కడ పరిస్థితి, శ్రీలక్ష్మి ఆరోగ్యం గురించి వాకబు చేశారని దుష్ప్రచారం చేస్తూ డిబేట్లు నిర్వహించింది. విశ్వభారతి ప్రాంగణం, గాయత్రి ఎస్టేట్‌లో ప్రశాంతంగా ఉన్న వాతావరణాన్ని చెదరగొట్టి ఉద్రిక్తతకు దారితీసేలా కథనాలు ప్రసారం చేసింది. రోప్ పార్టీ పోలీసులు భోజనం చేసేందుకు వెళుతుంటే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు వారిపై ఆందోళనకు దిగినట్లు ఎల్లో మీడియా తప్పుడు వార్తలకు తెగబడింది. తాజాగా సుప్రీంకోర్టు ఆదేశాల అనంతరం మంగళవారం సాయంత్రం వరకూ అంతా ప్రశాంతంగా ఉండటంతో ఇక రాత్రికి అవినాశ్‌ను అరెస్టు చేసే అవకాశం ఉందంటూ మళ్లీ ప్రచారానికి తెరతీసింది.

శాంతియుతంగా నిరసన..

శ్రీలక్ష్మి, అవినాశ్‌ను పరామర్శించేందుకు ఎమ్మెల్యేలు రవీంద్రనాథ్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, శిల్పా చక్రపాణిరెడ్డి, ఎమ్మెల్సీలు రామసుబ్బారెడ్డి, రమేశ్, మేయర్లు సురేశ్‌బాబు, బీవై రామయ్య కడప, కర్నూలు కార్పొరేషన్ల కార్పొరేటర్లు ఆస్పత్రి వద్దకు వచ్చారు. ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్, సుధాకర్, ఆర్థర్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి నాలుగు రోజులుగా రాత్రింబవళ్లు ఆస్పత్రి వద్దే ఉంటున్నారు. ఎల్లో మీడియా దుష్ప్రచారాలను నిరసిస్తూ ఎమ్మెల్యేలు, కార్యకర్తలు మంగళవారం రాత్రి 7 గంటలకు ఆస్పత్రి ఎదుట శాంతియుతంగా నిరసన తెలిపారు. తన తల్లి ఆరోగ్యం కుదుట పడగానే 27 తర్వాత తానే స్వయంగా వస్తానని ఎంపీ అవినాష్‌రెడ్డి ప్రకటించారని, మానవత్వంతో వ్యవహరించాలని సీబీఐ అధికారులకు సూచించారు.



తాగునీటి కోసం రాస్తారోకో

వెంకటాపురం(కె): తాగునీటి కోసం ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండల పరిధిలోని ఉప్పేడు, గొల్లగూడెం గ్రామస్తులు మంగళవారం ఖాళీ బిందెలతో రోడ్డెక్కారు. తమకు 15 రోజులుగా తాగునీరు అందడం లేదని.. సర్పంచ్, కార్యదర్శులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ వెంకటాపురం(కె), భద్రాచలం రహదారిపై ఖాళీ బిందెలతో కూర్చున్నారు. సుమారు 2గంటల పాటు రహదారిపై ఆందోళన చేపట్టారు.

ధాన్యం కొనుగోళ్లలో నల్లగొండ టాప్

- ఇప్పటికి 5.56 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు
- 5.25లక్షల మెట్రిక్ టన్నులతో రెండో స్థానంలో నిజామాబాద్
- కొనుగోళ్లలో వెనుకబడిన 18 జిల్లాలు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లలో సమస్యలు తప్పడం లేదు. కొన్ని జిల్లాల్లో కొనుగోళ్లు నత్తనడకన నడుస్తుండగా, మరి కొన్ని జిల్లాల్లో వేగంగా జరుగుతున్నాయి. అత్యధికంగా కొనుగోలు చేసిన జిల్లాల్లో నల్లగొండ మొదటి స్థానంలో ఉంది. కొనుగోళ్లలో అనేక సమస్యలు ఎదురవుతున్నా జిల్లా యంత్రాంగం వాటిని ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ ముందుకు సాగుతోంది. సాధారణంగా ఏటా నిజామాబాద్ జిల్లాల్లో అత్యధికంగా ధాన్యం కొను గోలు చేస్తారు. ఈసారి మాత్రం నల్లగొండలో ఇప్పటికే అత్యధికంగా కొనుగోలు చేశారు. ఈ రెండు జిల్లాలతో పాటు మరో 10 జిల్లాల్లో కొనుగోళ్లు వేగంగా సాగుతున్నా మిగతా జిల్లాల్లో మాత్రం కొనుగోళ్లలో సమస్యలు తప్పడం లేదు. రాష్ట్రంలో 62,15,957 మెట్రిక్ టన్నులు కొనుగోలు లక్ష్యంగా పెట్టుకోగా అందులో ఇప్పటికి 56,72,270 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు.

తాలు తంటా.. మిల్లర్ల కొర్రీలు

రాష్ట్రంలోని 18 జిల్లాలు ధాన్యం కొనుగోళ్లలో వెనకబడ్డాయి. అందులో 9 జిల్లాల్లో కొనుగోలు లక్ష్యంలో సగం ధాన్యం కొనుగోలు చేయకపోగా, మరో 9 జిల్లాల్లో పావలావంతు ధాన్యం కూడా కొనుగోలు చేయలేదు. భూపాలపల్లి, ములుగు, నాగర్‌కర్నూల్, వికారాబాద్, రంగారెడ్డి, జోగుళాంబ గద్వాల, మేడ్చల్, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాలు ధాన్యం కొనుగోళ్లలో వెనుకబడ్డాయి. మరి కొన్ని జిల్లాలు లక్ష్యంలో సగం ధాన్యం కూడా కొనుగోలు చేయలేదు. అందులో యాదాద్రి, మెదక్, సిద్దిపేట, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, నారాయణ్‌పేట, నిర్మల్, వరంగల్, కొత్తగూడెం జిల్లాలు ఉన్నాయి.

అనేక చోట్ల అకాల వర్షాల కారణంగా ధాన్యం తడవడం, కొన్నిచోట్ల తడిచిన ధాన్యం మొలకెత్తడం, మరికొన్ని తాలు ఉందంటూ మిల్లర్లు నిరాకరించడం వంటి సమస్యలతో కొనుగోళ్లు వేగంగా సాగడం లేదు. ముఖ్యంగా మిల్లర్ల కొర్రీలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈసారి వర్షాకాలం సీజన్ సాగును ముందే ప్రారంభించేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో కొనుగోళ్లలో వేగం పుంజుకోకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

పెరిగిన దిగుబడి.. తగ్గని రాశులు

గతంలో ఎప్పుడూ లేనట్లుగా పెద్ద ఎత్తున ధాన్యం దిగుబడి వచ్చింది. ఎక్కడ చూసినా ధాన్యం రాశులే. రాష్ట్ర వ్యాప్తంగా కొనుగోళ్లు వేగంగా సాగుతున్న జిల్లాల్లోనూ ఇంకా కల్లాల్లో ధాన్యం ఒడవడం లేదు. ఒక్క నల్లగొండ జిల్లాలోనే చూస్తే గత సీజన్‌లో 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే ఈసారి ఇప్పటికే 5.56 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా కొనుగోలు చేసినా ఇంకా కల్లాల్లో ధాన్యం నిల్వలు ఉన్నాయి.

ప్రత్యేక చొరవతోనే..

నల్లగొండ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో జిల్లా యంత్రాంగం ప్రత్యేక చొరవ చూపుతోంది. అధికారులు మొదట్లో 272 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అయితే ఈ సీజన్‌లో ధాన్యం అధికంగా దిగుబడి రావడం, దానికితోడు అకాల వర్షాలు రావడంతో త్వరగా ధాన్యం కొనుగోలు చేయాలని మరో 100 కొనుగోలు కేంద్రాలను అదనంగా ఏర్పాటు చేసి కొనుగోళ్లను ముమ్మరం చేశారు. జిల్లా కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు కొనుగోళ్లు ప్రారంభమైనప్పటి నుంచి 45 రోజులుగా ప్రతి రోజు నాలుగైదు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పర్యటిస్తున్నారు.

అవినాశ్ ముందస్తు బెయిల్‌పై నిర్ణయానికి ఇన్ని రోజులా!

- ఆదేశాలిచ్చినా ఉత్తర్వులు జారీ చేయకపోవడమేమిటి?
- 25న అవినాశ్‌రెడ్డి పిటిషన్‌పై నిర్ణయం తీసుకోండి
- తెలంగాణ హైకోర్టు వెకేషన్ బెంచ్‌కు సుప్రీంకోర్టు ధర్మాసనం సూచన
- బెయిల్ కోరే హక్కు పిటిషనర్‌కు ఉంది
- సునీత తరపు న్యాయవాదితో జస్టిస్ నరసింహ



సాక్షి, న్యూఢిల్లీ: ఎంపీ అవినాశ్‌రెడ్డి ముందస్తు బెయిలుపై నిర్ణయం తీసుకోవడానికి ఇన్ని రోజులా అని తెలంగాణ హైకోర్టుపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తంచేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చినా ఉత్తర్వులు జారీ చేయకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేసింది. అవినాశ్ పిటిషన్‌పై ఈ నెల 25న హైకోర్టు వెకేషన్ బెంచ్ విచారణ జరిపి తగిన ఆదేశాలివ్వాలని ఆదేశించింది. గతంలో మరో బెంచ్ విచారించినప్పటికీ వెకేషన్ బెంచ్ విచారణకు అడ్డంకి కాదని తెలిపింది. ఈ మేరకు జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ పీఎస్ నరసింహ ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణకు (జూన్ 5) వచ్చే వరకు సీబీఐ నుంచి మధ్యంతర రక్షణ కల్పించాలని లేదా తన పిటిషన్‌ను వెకేషన్ బెంచ్ విచారించేలా ఆదేశాలివ్వాలంటూ అవినాశ్‌రెడ్డి దాఖలు చేసిన అప్లికేషన్‌పై ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చిన తర్వాత హైకోర్టు విచారించలేదా అని జస్టిస్ నరసింహ ప్రశ్నించారు. హైకోర్టు రెండుసార్లు విచారించిందని, ఉత్తర్వులు ఇవ్వలేదని, జూన్ 5కు వాయిదా వేసిందని, మే 15న సీబీఐ నుంచి నోటీసులు వచ్చాయని అవినాశ్ తరపున సీనియర్ న్యాయవాది వి.గిరి తెలిపారు. ఆ తర్వాత ఏం జరిగిందని ధర్మాసనం ప్రశ్నించగా.. సీబీఐ నోటీసులు ఇచ్చిందన్నారు. 'హైకోర్టులో విచారణ ఉండగా సీబీఐ నోటీసులు ఇవ్వడం గమనార్హం' అని అభిప్రాయపడిన ధర్మాసనం.. సీబీఐ విచారణకు హాజరు కాలేదు కదా అని అనగా.. ఏడుసార్లు పిటిషనర్ హాజరయ్యారని గిరి తెలిపారు. ఒక్క రోజు వ్యవధిలో రావాలని నోటీసులు ఇవ్వడంతో మూడు రోజులు సమయం కోరామన్నారు. సీబీఐ తరపున ఎవరైనా హాజరయ్యారా అని ధర్మాసనం ప్రశ్నించగా.. ఎవరూ హాజరు కాలేదని వైఎస్ వివేకా కుమార్తె సునీత తరపు న్యాయవాది లూత్రా తెలిపారు. హైకోర్టులో ఏప్రిల్ 27న ఇద్దరి పిటిషన్లూ విచారణకు వచ్చాయని, సీజే వద్దకు వెళ్లినా ఎలాంటి ఆర్డర్ రాలేదని, జూన్ 5న మేటర్ జాబితా అయిందని లూత్రా వివరించారు. జస్టిస్ నరసింహ జోక్యం చేసుకొని.. ఏమైనా అరెస్టు భయం ఉందా అని ప్రశ్నించారు. తాను మొదటి నుంచి అదే చెబుతున్నానని, ఇప్పటికే అవినాశ్ తండ్రి అరెస్టయ్యారని, తల్లి ఆసుపత్రిలో ఉన్నారని గిరి చెప్పారు. ఈ సమయంలో లూత్రా జోక్యం చేసుకోవడంతో గిరి ఒకింత అసహనం వ్యక్తం చేశారు. గిరిని ధర్మాసనం మందలించడంతో ఆయన ధర్మాసనానికి క్షమాపణలు తెలిపారు. బెయిలు కోరే హక్కు పిటిషనర్‌కు ఉందని ధర్మాసనం లూత్రానుద్దేశించి వ్యాఖ్యానించింది. హైకోర్టు వెకేషన్ బెంచ్ గురించి ఆరా తీసింది. హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న పిటిషన్లు వెకేషన్ బెంచ్ వినాలని సూచిస్తామని తెలిపింది. హైకోర్టుకు వెళ్లాలని ఇరువర్గాలకు తెలిపింది. అవినాశ్ వద్దకు వెళ్లాలని సీబీఐ ప్రయత్నించగా వందలాది మంది అనుచరులు అడ్డుకున్నారని లూత్రా అనగా.. అవన్నీ సీబీఐ న్యాయవాది చెబుతారని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అనంతరం జస్టిస్ నరసింహ ఉత్తర్వులు వెలువరించారు.

రోజుకు లక్షన్నర టన్నుల ధాన్యం సేకరణ

- ఇప్పటివరకు 38.50 ఎల్ఎంటీ ధాన్యం సేకరణ
- ధాన్యం కొనుగోళ్లపై మంత్రి గంగుల కమలాకర్ సమీక్ష



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు సాగుతున్న తీరు సంతృప్తికరంగా ఉందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ధాన్యం కొనుగోళ్లపై మంగళవారం ఆయన రాష్ట్ర సచివాలయంలో పౌరసరఫరాల కమిషనర్ అనిల్ కుమార్, కార్పొరేషన్ జీఎం రాజారెడ్డి తదితరులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. సగటున రోజుకు లక్షన్నర మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు యాసంగి ధాన్యాన్ని 38.50 లక్షల మెట్రిక్ టన్నుల మేర సేకరించామని, ఇది గత సీజన్ కన్నా 10 లక్షల మెట్రిక్ టన్నులు అధికమని అన్నారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి ఆశించినంత సహకారం లేకున్నా, రైతుల నుంచి కనీస మద్దతు ధరతో సేకరిస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు అనుకూల విధానాల కారణంగా ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచిందని, గతంలో ఎన్నడూ లేనంతగా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం పోటెత్తుతున్న పరిస్థితులు ఉన్నాయని అన్నారు. అకాల వర్షాలతో పలు జిల్లాల్లో కోట్లాది రూపాయల ధాన్యం నేలపాలైందని, వారిని కూడా ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. మంగళవారం వరకూ రాష్ట్రవ్యాప్తంగా 7 వేల కొనుగోలు కేంద్రాల ద్వారా రూ. 7,907 కోట్ల విలువ గల ధాన్యాన్ని 6 లక్షల మంది రైతుల నుంచి సేకరించినట్లు తెలిపారు. ఇప్పటికే 400కి పైగా కొనుగోలు కేంద్రాల్లో సేకరణ పూర్తి కాగా, వాటిని మూసేసినట్లు చెప్పారు. ఎఫ్‌సీఐ నిర్దేశించిన కనీస నాణ్యతా ప్రమాణాలను రైతులు పాటిస్తూ, ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తేవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని మౌలిక వసతులను ఏర్పాటు చేశామని, అక్కడక్కడా ఎదురవుతున్న సమస్యలపై ఎప్పటికప్పుడు అధికార యంత్రాంగం స్పందిస్తుందని, రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని మంత్రి ఆదేశించారు.

జిల్లా వార్తలు

ప్రజలకు భరోసా కల్పిస్తున్న ఎంపీ నామ



లబ్ధిదారులతో నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజల సమస్యలను పరిష్కరించడం ద్వారా ఎంపీ నామ నాగేశ్వరరావు భరోసా కల్పిస్తున్నారని రైతుబంధు ఖమ్మం జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మంలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో 15 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.7.15 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం ఆయన అందజేసి మాట్లాడారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న వారికి ఎంపీ సిఫారసుతో సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరవుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కనకమేడల సత్యనారాయణ, చిత్తారు సింహాద్రియాదవ్, ఉప్పునూతల నాగేశ్వరరావు, మలీదు వెంకన్న, బత్తుల శ్రీనివాసరావు, తన్నీరు రవికుమార్, జానీబాబా పాల్గొన్నారు.

ఉట్నూర్ ఐటీడీఏ ఉద్యాన అధికారిగా సందీప్



సందీప్‌కుమార్

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం డివిజన్ ఉద్యాన అధికారి (ఆన్ డ్యూటీ)గా విధులు నిర్వర్తిస్తున్న గుడిమళ్ల సందీప్‌కుమార్ నిర్మల్ జిల్లా ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు ఉద్యాన అధికారిగా నియమితులయ్యారు. ఈమేరకు ఆయన మంగళవారం ఉట్నూర్‌లో బాధ్యతలు స్వీకరించి అక్కడి కలెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా, భద్రాచలం డివిజన్ ఉద్యాన అధికారిగా సందీప్‌కుమార్‌కు పోస్టింగ్ ఉండగా, ఖమ్మం డివిజన్ ఉద్యాన అధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం ఖాళీ అయిన ఖమ్మం డివిజన్ ఉద్యాన అధికారి బాధ్యతలను సత్తుపల్లి ఉద్యానాధికారి మీనాక్షికి అప్పగిస్తూ జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమాధికారి జి.అనసూయ ఉత్తర్వులు జారీ చేశారు.

టీఎన్జీవోస్ సభ్యత్వ నమోదు

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం కలెక్టరేట్‌లోని సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కార్యాలయంలో మంగళవారం టీఎన్జీవోస్ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు అఫ్జల్‌హసన్ పలువురికి సభ్యత్వాలు అందజేశారు. నాయకులు జీఎస్.ప్రసాదరావు, ఎం.డీ.మజీద్, లక్ష్మణ్, మురళి, ఉపేందర్, వెంకట్రావు, బాషుమియా, ఉమామహేశ్వరరావు, వై.శ్రీనివాసరావు, సాదిక్ పాల్గొన్నారు.

ఇంకా మీనమేషాలే..



- సబ్ కాంట్రాక్టర్ అక్రమాలపై పట్టింపులేని 'సింగరేణి'
- అసలు కాంట్రాక్టర్‌పై కూడా చర్యలు కరువు
- ఫలితంగా బాధితులకు బెదిరింపులు

సత్తుపల్లి: సింగరేణిలో ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.లక్షల్లో దండుకుని తప్పించుకొని తిరుగుతున్న వారిపై చర్యలు తీసుకోవడంలో సింగరేణి సంస్థ మీనమేషాలు లెక్కిస్తోంది. ఈ వ్యవహారం సింగరేణికి సంబంధించినది కాదంటూ తప్పించుకునే ధోరణిలో అధికారులు వ్యవహరిస్తుండడం బాధితులకు ఆవేదన కలిగిస్తోంది. సత్తుపల్లి ఓసీలో ఉద్యోగాలు ఇప్పిస్తామని సబ్ కాంట్రాక్టర్ శరత్‌చంద్రపై రూ.లక్షల్లో వసూలు చేసినట్లు బాధితులు అటు సింగరేణి, ఇటు పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై 'సాక్షి'లో సింగరేణి ఉద్యోగాల పేరిట టోకరా..., సింగరేణిలో సబ్ కాంట్రాక్టర్లదే హవా, దొరికితేనే దొంగలు.. శీర్షికలతో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. అసలు కాంట్రాక్టర్ చేయాల్సిన పనులను సబ్ కాంట్రాక్టర్లకు ఇవ్వడం, ఆపై వారు దోపిడీకి తెర తీయడంతో పలువురు మోసపోయినా సింగరేణి యాజమాన్యం చర్యలకు దిగకపోవటంతో మరిన్ని అక్రమాలకు ఊతమిచ్చినట్లవుతోంది. సబ్ కాంట్రాక్టర్‌ను పిలిపించి చర్యలు ప్రారంభిస్తే గంటల వ్యవధిలోనే సమస్య కొలిక్కి వస్తుందని తెలిసినా ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో నిందితులు దర్జాగా తిరుగుతున్నారు.

కనీస విచారణ లేదు..

సత్తుపల్లి ఓసీలో పనులను కొత్తగూడెంనకు చెందిన శ్రీసూర్య కన్‌స్ట్రక్షన్స్ దక్కించుకుని శరత్‌చంద్రకు సబ్‌కాంట్రాక్టు ఇచ్చారు. ఈయన పలువురి నుంచి డబ్బులు దండుకున్నట్లు ఫిర్యాదులు అందినా ఆ వ్యవహారం పోలీసులే చూసుకుంటారని సింగరేణి అధికారులు దాటవేత ధోరణి అవలంబిస్తున్నారు. ఇకనైనా అక్రమాలకు కాంట్రాక్టర్‌ను బాధ్యులుగా చేయకపోతే మరింత మంది సబ్‌కాంట్రాక్టర్ల ముసుగులో అక్రమాలకు పాల్పడతారని చెబుతున్నారు. కాగా, శరత్‌చంద్రతో సింగరేణి అధికారులు కొందరు అత్యంత సన్నిహిత సంబంధాలు నెరిపారని, గతంలో కూడా అక్రమాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవటంతోనే వసూళ్ల పర్వం విపరీతంగా పెంచాడని ఆరోపిస్తున్నారు.

పోలీసు కేసు అయితే ఏమిటి?

డబ్బులు వసూలు చేసినట్లు పోలీసులు, సింగరేణి అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారా.. కేసు అవుతుందా.. అయినా మాకేంటి.. మహా అయితే మూడు నెలలు జైలుకు వెళ్లి మళ్లీ వస్తాం.. అంటూ పలువురు బాధితులకు గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి బెదిరిస్తున్నట్లు సమాచారం. రాజకీయ పలుకుబడి ఉన్న తమను ఏమీ చేయలేరని ధీమాగా ఉన్నట్లు సమాచారం. ఓపక్క అధికారులు చర్యలు తీసుకోకపోగా, మరోపక్క తమనే బెదిరిస్తుండడంతో బాధితులు మరింత వేదనకు గురవుతున్నారు.

కాంట్రాక్టర్‌కు సమాచారం ఇచ్చాం..



డబ్బుల వసూలు విషయమై శ్రీసూర్య కన్‌స్ట్రక్షన్స్ కాంట్రాక్టర్‌కు మా అధికారులు సమాచారం ఇచ్చారు. ఇప్పటి వరకు సమాధానం రాలేదు. సీఎస్పీ కాంట్రాక్ట్ కాల వ్యవధి ఇంకా వారంలో ముగుస్తుంది. సబ్ కాంట్రాక్టు వ్యవహారంతో మాకు సంబంధం లేకపోయినా బిల్లులు నిలిపేస్తాం.

–జక్కం రమేశ్, జీఎం, సింగరేణి కొత్తగూడెం ఏరియా

అటవీ ఉత్పత్తులు జీసీసీకి అమ్మేలా అవగాహన

ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు



అధికారులతో సమీక్షిస్తున్న పీఓ గౌతమ్ పొట్రు

భద్రాచలం: అటవీ ప్రాంతంలో గిరిజనులు సేకరించే ఉత్పత్తులను దళారులకు కాకుండా జీసీసీకే అమ్మేలా అధికారులు అవగాహన కల్పించాలని ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం జీసీసీ అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ వచ్చేనెల నుంచి ఆదివాసీ గిరిజను లు ఇప్పపువ్వు సేకరించనుండగా జీసీసీ డీఆర్ డిపోల కు అమ్మేలా చూడాలని తెలిపారు. అంతేకాకుండా గిరిజనులకు ఎప్పటికప్పుడు డబ్బు చెల్లించేందుకు నిధుల విషయమై ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే జీసీసీ లాభాల బాటలోకి వస్తుందని తెలిపా రు. గిరిజన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోసం ఏర్పాటుచేసిన పెట్రోల్ బంక్‌ల నిర్వహణపై దృష్టి సారించాలని, అక్కడక్కడా వస్తున్న ఫిర్యాదులు పరిష్కరించాలని చెప్పారు. బంక్‌లను 24 గంటల పాటు నడిపితే లాభాలు వస్తాయని తెలిపారు. సమావేశంలో డీఎం జీసీసీ విజయ్‌కుమార్, అధికారులు నర్సింహారావు, లక్ష్మీ, దావీద్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మానసికంగా కుంగిపోయారా?

14416 కు ఫోన్ చేయండి..

ఖమ్మం వైద్యవిభాగం: మానసికంగా కుంగుబాటుకు గురైన వారి కోసం ప్రభుత్వం 14416 టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందని ఖమ్మం డీఎంహెచ్‌ఓ బి.మాలతి తెలిపారు. వివిధ పరీక్షల్లో రాణించని విద్యార్థులు మానసికంగా కుంగిపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్న నేపథ్యాన ప్రభుత్వం టోల్‌ఫ్రీ నంబర్ ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. విద్యార్థులే కాకుండా అన్నివర్గాల ప్రజలకు ఈ నంబర్‌కు ఫోన్ చేయొచ్చని తెలిపారు.

తునికాకు.. ఉపాధి మాకు..



కల్లంలో ఆరబెట్టిన తునికాకు కట్టలు

ఉదయం నుంచే అటవీ ప్రాంతానికి గిరిజనులు



సేకరించిన తునికాకుతో వస్తున్న మహిళలు



తునికాకు కట్టలు కడుతున్న కుటుంబం

కొత్తగూడెంరూరల్: పల్లె ప్రాంతాల్లోని గిరిజనులకు తునికాకు సేకరణ మండుటెండల్లోనూ ఉపాధి కల్పిస్తోంది. ప్రతీ రోజు గిరిజనులు ఉదయాన్నే అటవీ ప్రాంతంలోకి వెళ్లి తునికాకు సేకరణలో నిమగ్నమవుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ, ఆళ్లపల్లి, కొత్తగూడెం రేంజ్ పరిధి మైలారం, పునుకుడుచెలక, మర్రిగూడెం, లోతువాగు, బంగారుచెలక, పడిగాయిగూడెం, చింతకుంట, తుమ్మలగూడెం తదితర ప్రాంతాల్లో తునికాకు సేకరణ చురుగ్గా సాగుతోంది. చాతకొండ, ఆళ్లపల్లి, కొత్తగూడెం రేంజ్ పరిధిలో 1,200 స్టాండర్డ్ బ్యాగుల సేకరణ లక్ష్యం కాగా.. ఈ నెల 7వ తేదీ నుంచి కూలీలు తునికాకు సేకరణ, కట్టలు కట్టడంలో నిమగ్నమయ్యారు. ఇప్పటివరకు 600 బ్యాగ్‌లు సేకరించినట్లు అధికారిక సమాచారం. కాగా, వేసవిలో వ్యవసాయ పనులు లేక ఇబ్బంది పడే గిరిజనులకు తునికాకు సేకరణతో ఉపాధి లభిస్తోంది. యాభై ఆకుల కట్టకు రూ.3 చెల్లిస్తుండగా, ఒక్కో వ్యక్తి రోజుకు 200 నుంచి 400 కట్టల ఆకు సేకరిస్తున్నట్లు సమాచారం. తద్వారా సుమారు రూ.600 మొదలు రూ.800 వరకు సంపాదిస్తున్నట్లు చెబుతున్నారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం



శిక్షణకు హాజరైన కేడెట్లతో అధికారులు

ఖమ్మంఅర్బన్: విద్యార్థులను దేశభక్తి కలిగిన ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ కృషి అభినందనీయమని లెఫ్టినెంట్ కల్నల్ కమాండింగ్ ఆధికారి నవీన్‌యాదవ్ పేర్కొన్నారు. ఖమ్మం బల్లేపల్లిలోని బ్లూమింగ్ మైండ్స్ సెంట్రల్ స్కూల్‌లో ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కేడెట్లు శిక్షణలో నేర్చుకునే అంశాలతో ఉన్నత స్థాయికి చేరాలన్నారు. పది రోజుల పాటు సాగే ఈ శిబిరానికి ఖమ్మం, వరంగల్, భద్రాదికొత్తగూడెం జిల్లాల కేడెట్లు హాజరుకాగా, ఎన్‌సీసీ ఎస్ఎం జితేంద్ర వషిట్, పాఠశాల చైర్మన్ డాక్టర్ సత్యనారాయణరెడ్డి, కరస్పాండెంట్ అశోక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్ పాల్గొన్నారు.